

'కెనాల్' కట్టలపై చెట్ల నరికివేత

వాకాడు మండలం పంబలి లాకుల వద్ద బకింగ్‌హామ్ కెనాల్ కర కట్టలపై విలువైన వృక్ష సంపదను యథేచ్ఛగా నరికేస్తున్నారు. - 8లో



బడి కోసం.. ఆగని పోరాటం

ప్రభుత్వం చేపట్టిన పాఠశాలల విలీన ప్రక్రియపై పలు గ్రామాల్లోని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చేపట్టారు. - 8లో



నిరంకుశ పాలనపై నిరసన

కూటమి ప్రభుత్వం సాగిస్తున్న నిరంకుశ పాలనపై వైఎస్సార్‌సీపీ పాకాల నేతలు బుధవారం నిరసన తెలిపారు. - 8లో

న్యూస్‌రీల్

తిరుపతిలో 'చెప్కో' బృందం పర్యటన



భూమి కుంగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న చెప్కో కమిటీ

తిరుపతి తుడా : తిరుపతి నగరంలో భూగర్భ డ్రైనేజీ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వ ప్రజారోగ్య, పర్యావరణ ఇంజినీరింగ్ సంస్థ (చెప్కో) అడ్వైజరీ కమిటీ బుధవారం నగరంలో పర్యటించింది. కమిటీ సభ్యులు చౌరాసియా, అమిత్ కమిషనర్ మౌర్యతో కలిసి రేణిగుంట రోడ్డులో భూమి కుంగిన ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం సమస్య పరిష్కారం కోసం చేపట్టాల్సిన చర్యలను నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులతో చర్చించారు. అలాగే తూకివాకం వద్ద మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని పరిశీలించారు. నగరం నుంచి మురుగునీరు వస్తున్న విధానం, శుద్ధి చేయడం, పరీక్షలు చేసిన అనంతరం నీటిని తిరిగి వినియోగించే విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. శుద్ధి చేసిన నీటిని కొంత భాగం ల్యాంకో ఫ్యాక్టరీకి, కొంత నీటిని చుట్టుపక్కల వ్యవసాయ భూములకు సరఫరా చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు రైతులతో మాట్లాడి పలు విషయాలు ఆరా తీశారు. మురుగునీటి శుద్ధి విధానం బాగుందని ఈ విధానాన్ని డాక్యుమెంట్‌గా రూపొందించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఈ శ్యామ్‌సుందర్, ఎంఈ గోమతి, డీఈ రమణ, ఏఈ శిల్ప, మస్తాన్ పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి గురుకుల విద్యార్థులు



ఉదయ్‌కుమార్ జస్వంత్ బెన్హర్ బాబు

సత్యవేడు: జ్యోతిరావు పూలే బాలుర గురుకుల పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసిన ముగ్గురు విద్యార్థులు ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ప్రిన్సిపల్ సత్యనారాయణ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ తమ పాఠశాలలో చదివిన నారాయణవనం తంబూరు గ్రామానికి చెందిన ఉదయ్‌కుమార్, వరదయ్యపాళానికి చెందిన జస్వంత్, శ్రీకాళహస్తికి చెందిన బెన్హర్‌బాబు ఎంపికైనట్లు వెల్లడించారు. ఈ మేరకు విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

ట్యాలీపై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న రాంబాబు

తిరుపతి సిటీ: నేటి ఆధునిక సాంకేతిక యుగంలో విద్యార్థులు ఉపాధి అవకాశాల కోసం ట్యాలీ సాఫ్ట్‌వేర్‌పై అవగాహన పెంచుకోవాలని హిపోక్లాడ్ అకాడమీ ప్రైవేట్ లిమిటెడ్ సీనియర్ ఫ్యాకల్టీ రాంబాబు తెలిపారు. మహిళా వర్సిటీ ఎంబీఏ విభాగం ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు ట్యాలీ ప్రైమ్ విత్ జీఎస్టీపై వర్క్ షాప్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భారత్‌లో అన్ని రంగాల్లోనూ అకౌంటింగ్ పర్పస్ కోసం ట్యాలీ ప్యాకేజీను విరివిగా వినియోగిస్తున్నారని తెలిపారు. కంప్యూటరైజ్డ్ ఫైనాన్షియల్ అకౌంటింగ్, ఇన్వెంటరీ మాస్టర్‌ను సృష్టించడం, పన్నుల నిర్ధారణ వంటి వాటిలో ట్యాలీ ప్రముఖ పాత్ర పోషిస్తోందన్నారు. ఈ వర్క్‌షాపులో ప్రొఫెసర్ బి విజయలక్ష్మీ, ఎంబీఏ విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పురుగు పట్టిన పోషణ



నాయుడుపేటలోని అంగన్‌వాడీ కేంద్రానికి సరఫరా చేసిన నాసికరం కందిపప్పు (ఇన్‌సెట్) పప్పులో పురుగు

SAKSHI గ్రౌండ్ రిపోర్ట్ GROUND REPORT

చిన్నారుల ఎదుగుదలకు సహకరించాలి.. నాణ్యమైన విద్యను అందించాలి.. గర్భిణులు రక్తహీనత బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.. బాలింతల ఆరోగ్య రక్షణకు చర్యలు చేపట్టాలి.. ఇదే లక్ష్యంతో అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారు. ప్రీ స్కూళ్లుగా తీర్చిదిద్దారు. మెరుగైన విద్యాబోధన అందించారు. సంపూర్ణ పోషణ పథకం కింద పౌష్టికాహారం అందజేశారు. అయితే కూటమి సర్కారు వచ్చిన తర్వాత అంగన్‌వాడీ సెంటర్లను నిర్లక్ష్యం చేసింది. పిల్లల చదువులను అటకెక్కించింది. నాసిరకం సరుకులను సరఫరా చేస్తోంది. కుళ్లిన కోడిగుడ్లను పంపిణీ చేస్తోంది. చివరకు తల్లీబిడ్డల ప్రాణాలతో సైతం చెలగాటమాడుతోంది.



- గాడితప్పిన అంగన్‌వాడీ కేంద్రాలు
- నాసిరకం సరుకులు సరఫరా చేస్తున్న ప్రభుత్వం
- పూర్తిగా దెబ్బతిన్న దినుసుల పంపిణీ
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- రోగాల బారిన పడుతున్న గర్భిణులు, బాలింతలు, చిన్నారులు



నాయుడుపేటలోని అంగన్‌వాడీ స్కూల్‌లో నాణ్యత లేని బాలామృతం

తిరుపతి అర్బన్ : జిల్లాలో అంగన్‌వాడీ పాఠశాలలను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అద్భుతంగా తీర్చిదిద్దింది. ప్రీ స్కూళ్ల పేరుతో పిల్లలకు మెరుగైన విద్యాబోధనను అందుబాటులోకి తీసుకువచ్చింది. అలాగే నాణ్యమైన పోషకాహార సరుకులను చిన్నారులతోపాటు బాలింతలు, గర్భిణులకు పంపిణీ చేసింది. దీంతో అంగన్‌వాడీ బడుల్లో విద్యార్థుల సంఖ్యల గణనీయంగా పెరిగింది. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అంగవాడీ పాఠశాలల పరిస్థితి అగమ్యగోచరంగా మారిపోయింది. పాలకులు పట్టించుకోకపోవడంతోపాటు అధికారులు పర్యవేక్షణ కొరవడడంతో పూర్తిగా గాడి తప్పింది. విద్యకు ప్రాధాన్యత ఇవ్వకపోగా, నాసిరకం సరుకులను బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు అందిస్తున్నారు. సివిల్ సప్లయి విభాగం నుంచి పురుగు పట్టిన సరుకులు వస్తున్నప్పటికీ అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రశ్నించేందుకు ధైర్యం చేయలేని దుస్థితి దాపురించింది. చేసేది లేక వచ్చిన నాణ్యత లేని పోషకాహారాన్నే పంపిణీ చేసి చేతులు దులుపుకోవాల్సి వస్తోంది. ఈ మేరకే రెండు రోజుల క్రితం శ్రీకాళహస్తి బీసీ బాలుర వసతిగృహంలో నాసిరకం సరుకులతో చేసిన అల్పాహారం తిని 16 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైనట్లు తెలుస్తోంది.

కేంద్ర పథకం.. విఫలం

కేంద్రప్రభుత్వం పోషణ్ వాటిక పథకం కింద ఒక్కో అంగన్‌వాడీ స్కూల్‌కు రూ.10 వేలను ఇటీవల మంజూరు చేసింది. ఆ నిధులతో అంగన్‌వాడీ పాఠశాల ప్రాంగణంలోనే ప్రకృతి సేద్యం ద్వారా ఆకు కూరలు, కూరగాయలు సాగు చేసి వాటిని వండి పిల్లలకు వడ్డించాల్సి ఉంది. ఈ క్రమంలోనే జిల్లాలోని తొలి విడతలో 475 స్కూళ్లకు రూ.47.50లక్షలు విడుదల చేశారు. అయితే పట్టించుకునేవారు లేక ఈ పథకం పూర్తిగా విఫలమైంది. అధికారుల అలసత్వంతోనే పిల్లలకు చేకూరాల్సిన ప్రయోజనం దూరమైంది.

అరకొరగా విదిలిస్తూ..

అంగన్‌వాడీ పాఠశాలల్లో పిల్లలతోపాటు గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న కందిపప్పుకు కూటమి ప్రభుత్వం కోతలు పెట్టింది. అధికారంలోకి వచ్చిన తొలి ఆరునెలల పాటు కందిపప్పును పూర్తిగా అందించలేదు. దీంతో పంపిణీ చేయాల్సిన పౌష్టికాహారం ప్రశ్నార్థకంగా మారింది.ఆ తర్వాత సరఫరా చేసిన పప్పు దినుసుల్లో నాణ్యత కరువైంది. పురుగులు పట్టిన పప్పులు ఇవ్వడంతో అంగన్‌వాడీ సిబ్బందికి దిక్కుతోచని పరిస్థితి ఎదురైంది. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళితే ఎండలో పెట్టి.. ఆరబెట్టి.. తర్వాత వండి పిల్లలకు వడ్డించేయండి అంటూ చేతులు దులిపేసుకున్నట్లు తెలిసింది. ఈ విధమైన నాసిరకం సరుకులను తిని పిల్లలు, బాలింతలు, గర్భిణులు రోగాల బారిన పడుతున్నట్లు పెద్దసంఖ్యలో ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పట్టించుకునేవారే లేరు

క్షేత్రస్థాయిలో అవసరాలకు అనుగుణంగా సరుకులు అంగన్‌వాడీ కేంద్రాలకు అందడం లేదు. ప్రధానంగా సివిల్ సప్లయి నుంచి ఏం సరుకులు వస్తున్నాయి..? వాటి నాణ్యత ఎలా ఉంది..? నాసిరకం సరుకును పంపిణీ చేస్తే పిల్లలు, బాలింతలు, గర్భిణులకు వాటిల్లే అనర్థాలేంటి..? అనే అంశాలను పట్టించుకునే అధికారులే కరువయ్యారు. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు చెప్పిన పనులు చేస్తే చాలనుకునే దుస్థితిలో పడిపోయారు. ఈ క్రమంలోనే అంగన్‌వాడీ కేంద్రాలపై ఎవరూ దృష్టి పెట్టడడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కార్యాలయాలకే అధికారులు పరిమితమవుతున్నారని, జిల్లా ఉన్నతాధికారులను మచ్చిక చేసుకోవడంలోనే నిమగ్నమవుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాలకు సాధారణంగా బియ్యం, కందిపప్పు, వంట నూనె, పాలు, కోడిగుడ్లు, బాలామృతం సరఫరా చేయాల్సి ఉంది. అయితే అవన్నీ వస్తున్నాయా..? అందులో నాణ్యత పరిస్థితి ఏంటనే విషయాలను అధికారులు విస్మరిస్తున్నారని పలువురు మండిపడుతున్నారు.

కుళ్లిన కోడిగుడ్లు

అంగన్‌వాడీ కేంద్రాలకు అందిస్తున్న కోడిగుడ్లలో నాణ్యత కరువైంది. కాంట్రాక్టర్లు కుళ్లిన కోడిగుడ్లను సరఫరా చేస్తున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. పిల్లలు, బాలింతలు, గర్భిణులకు ప్రతి నెలా 25 గుడ్లు చొప్పున అందిస్తున్నారు. ఈ లెక్కన జిల్లాలో నెలకు 26లక్షల కోడిగుడ్లు సరఫరా చేస్తున్నారు. ఈ స్థాయిలో కోడిగుడ్లు కొనుగోలు చేస్తున్నప్పటికీ అధికారులు పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది. దీంతో కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా నాణ్యతలేని, ప్రమాణాల స్థాయి లేని గుడ్లు సరఫరా చేస్తున్నారు. దీనిపై అధికారులను ప్రశ్నించే ధైర్యం లేక అంగన్‌వాడీ వర్కర్లు సర్దుకుపోతున్నారు. తమ కేంద్రానికి వచ్చిన వాటినే పంపిణీ చేసేస్తున్నారు. ఈ క్రమంలోనే ఇటీవల ఏర్పేడు మండలం చెన్నంపల్లె అంగన్‌వాడీ సెంటర్‌లో కుళ్లిపోయిన కోడిగుడ్లను సరఫరా చేసిన సంగతి తెలిసిందే.



అంగన్‌వాడీకి అందించిన కుళ్లిపోయిన కోడిగుడ్లు

గత వైఎస్సార్‌సీపీ హయాంలో పకడ్బందీగా..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం కింద అంగన్‌వాడీ కేంద్రాలకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని పకడ్బందీగా పంపిణీ చేసేవారు. గర్భిణులు, బాలింతలకు 15 రోజులకు ఒకసారి పోషకాహార కిట్‌లు అందించేవారు. అందులో నెలకు సరిపడా బియ్యం, కందిపప్పు కేజీ, ఆయిల్ అర కేజీ, రాగిపిండి 2 కేజీలు, అటుకులు కేజీ, ఖర్జూరం పావు కేజీ, చిక్కీలు పావుకేజీ, బెల్లం పావుకేజీ, పాలు 5 లీటర్లు, 25 గుడ్లు చొప్పున ఇచ్చేవారు. ఆ పథకాన్ని టీడీపీ కూటమి ప్రభుత్వం బాల సంజీవనిగా పేరు మార్చింది. అయితే తూతూమంత్రంగా సరుకులు అందించి సరిపెట్టేస్తోంది.



జిల్లా సమాచారం

అంగన్‌వాడీ స్కూళ్లు	2,491
గర్భిణులు	12,788
బాలింతలు	11,007
6నెలలు లోపు చిన్నారులు	9627
6నెలల నుంచి 3 ఏళ్ల లోపువారు	65,433
3ఏళ్ల నుంచి 6ఏళ్లలోపు పిల్లలు	47,814



శిథిలావస్థలో చిల్లకూరు మండలంలోని యోగేశ్వరపల్లి అంగన్‌వాడీ స్కూల్

రాజీ పడకూడదు



అంగన్‌వాడీ స్కూళ్లలో చిన్న పిల్లలు ఉంటారు. వాళ్ల విషయంలో రాజీ పడకూడదు. న్యాయంగా వారికి అందాల్సిన సరుకులు ఇవ్వాలి. నాణ్యతలేని కోడిగుడ్లు, నాసిరకం కందిపప్పు అందించడం దారుణం. ప్రభుత్వం దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలి. అధికారులు సైతం నిరంతరం పర్యవేక్షించాలి. నాణ్యత లేని సరుకులు వస్తే వాటిని తిప్పి పంపాలి.

– నాగరాజు, సీపీఎం జిల్లా కార్యదర్శి

నాణ్యత ఉండడం లేదు



అంగన్‌వాడీ పరిధిలో నిబంధనల మేరకు సరుకుల్లో నాణ్యత ఉండడం లేదు. కోడిగుడ్ల టెండర్ సమయంలో ఓ సైజ్ చెబుతున్నారు.. పంపిణీ చేసే సైజ్ చాలా చిన్నగా ఉంటోంది. కందిపప్పుతోపాటు ఇతర సరుకులు కూడా నాసికరంగా ఉంటునానయి. ఇలాంటివి తింటే చిన్నపిల్లలకు మంచిది కాదు. అంగన్‌వాడీ కేంద్రాలకు నాణ్యమైన సరుకులు ఇవ్వాలి.

– జయచంద్ర, సీఐటీయూ జిల్లా కార్యదర్శి

అలసత్వం వహిస్తే చర్యలు



అంగన్‌వాడీ పాఠశాల పరిధిలోని పిల్లలు, బాలింతలు, గర్భిణీలకు క్షేత్రస్థాయిలో నాణ్యమైన సరుకులను అందించేందుకు కృషి చేస్తున్నాం. ఏమైనా లోటుపాట్లు ఉంటే వాటిని సరిచేస్తాం. కందిపప్పుతోపాటు కోడిగుడ్లు, ఇతర సరుకుల విషయంలోను ప్రత్యేక శ్రద్ధ చూపుతాం. పాఠశాలలపై పర్యవేక్షణ పెంచడంతోపాటు ప్రత్యేక నిఘా పెడతాం. ఎవరైనా అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటాం. సివిల్ సప్లయి అధికారులతోనూ మాట్లాడతాం. నాణ్యత విషయంలో రాజీ లేకుండా పనిచేస్తాం. – వసంతబాయి, ఐసీడీఎస్ పీడీ, తిరుపతి

కక్కుర్తి తగదు



అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలు, బాలింతలు, గర్భిణులకు పంపిణీ చేసే సరుకుల విషయంలో కక్కుర్తి తగదు. పురుగు పట్టిన సరుకులు పంపిణీ చేయడం అన్యాయం. భవిష్యత్ సమాజానికి కూడా ఇది మంచిది కాదు. నాణ్యత లేని సరుకులను ఆహారంలో తీసుకుంటే అనారోగ్యానికి గురయ్యే ప్రమాదముంది. దీనిపై ప్రభుత్వం శ్రద్ధ తీసుకోవాలి.

– వేణు, సీపీఎం నగర కార్యదర్శి

నేడు చేనేత సదస్సు

నారాయణవనం : పంచాయతీ కార్యాలయ ఆవరణలో చేనేతపై అవగాహన సదస్సును గురువారం నిర్వహించనున్నట్లు హ్యాండ్‌లూమ్స్ ఏడీ రమేష్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఉదయం 10.30 గంటలకు సదస్సు ప్రారభమవుతుందని, మండలంలోని చేనేత కార్మికులు, ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

పీజీ సెట్‌లో 88.60 శాతం ఉత్తీర్ణత



ఫలితాలను విడుదల చేస్తున్న సెట్ చైర్మన్, కన్వీనర్, రిజిస్ట్రార్

- ఫలితాలు విడుదల
- ఎస్వీయూ రీజియన్‌లో 87.07 శాతం ఉత్తీర్ణత
- ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 89.94 శాతం
- జాగ్రఫీ, జనరల్‌లో ఉమ్మడి జిల్లా విద్యార్థులకు ఫస్ట్ ర్యాంక్

తిరుపతి సిటీ : రాష్ట్ర వ్యాప్తంగా 17 వర్సిటీల్లోని 143 పీజీ కోర్సుల్లో సీట్ల భర్తీ కోసం ఈ నెల 9 నుంచి నాలుగు రోజులు ఎస్వీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన ఏపీ పీజీ సెట్ ఫలితాలను బుధవారం విడుదల చేశారు. ఎస్వీయూలో వీసీ, పీజీ సెట్ చైర్మన్ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు, కన్వీనర్ ప్రొఫెసర్ పీసీ వెంకటేశ్వర్లు సబ్జెక్టుల వారీగా ఫలితాలు వెల్లడించారు. వారు మాట్లాడుతూ పరీక్షలకు 21,995 మంది హాజరుకాగా 19,488 మంది అర్హత సాధించినట్టు తెలిపారు. 88.60 శాతం ఉత్తీర్ణత నమోదైందన్నారు. ఎస్వీయూ రీజియన్‌లో 5,764 మంది పరీక్ష రాయగా 5,019 మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 1,422 మంది పరీక్షలకు హాజరుకాగా 1,279 మంది అర్హత సాధించినట్టు వెల్లడించారు. జాగ్రఫీ, జనరల్ టెస్ట్‌లో చిత్తూరు జిల్లాకు చెందిన దివ్వేష్‌రెడ్డి, ఎం.ప్రేమ్ కుమార్ ఫస్ట్ ర్యాంక్ సాధించినట్టు వివరించారు.

సీట్లు 25 వేలు, ఉత్తీర్ణులైన అభ్యర్థులు 19 వేలు

రాష్ట్రంలోని అన్ని వర్సిటీలో 25 వేలకు పైగా పీజీ సీట్లు ఉన్నాయి. ఏపీ పీజీ సెట్‌లో అర్హత సాధించిన అభ్యర్థులు 19,488 మంది. ఒక సీటుకు ఒక అభ్యర్థి కూడా పోటీ లేకపోవడం విశేషం. తద్వారా 2025-26 విద్యా సంవత్సరంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని వర్సిటీల్లో పీజీ అడ్మిషన్లు భారీ స్థాయిలో పడిపోనున్నాయి. దీంతో వర్సిటీల భవితవ్యం ప్రశ్నార్థకమేనంటూ మేధావులు, విద్యానిపుణులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

పీజీ సెట్-2025 ఫలితాల వివరాలు

కోర్సులు	సెట్‌కు హాజరైన అభ్యర్థులు	ఉత్తీర్ణులైన వారు
కెమికల్ సైన్స్	5,396	4,719
లైఫ్ సైన్స్	3,641	3,408
కంప్యూటర్ కోర్సులకు	1,858	1,547
కామర్స్	1,203	1,009
ఇంగ్లీష్	721	702
హ్యుమానిటీస్	736	726
జువాలజీ	1,347	1,177
గణితం	983	821
ఫిజిక్స్	808	652
బోటనీ	1,146	1,041
ఇతరాలు	4,156	3,686
మొత్తం	21,995	19,488

30 నుంచి శ్రీవారి సాక్షాత్కార వైభవోత్సవాలు



శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారి ఆలయం

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలో వెలసిన కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 30వ తేదీ నుంచి జూలై 2 వరకు శ్రీవారి సాక్షాత్కార వైభవోత్సవాలు నిర్వహించనున్నట్లు టీటీడీ అధికారులు తెలిపారు. గురువారం ఉదయం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. తెల్లవారుజామున సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి తోమాలసేవ, కొలువు, పంచాంగ శ్రవణం చేపడతారు. అనంతరం 7 నుంచి 11.30 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహిస్తారు. మధ్యాహ్నం 12.30 గంటల నుంచి భక్తులను స్వామివారి దర్శనానికి అనుమతిస్తారు. 30వ తేదీ ఉదయం 11 గంటలకు స్నపన తిరుమంజనం, సాయంత్రం ఊంజల్ సేవ, రాత్రి 7 గంటలకు పెద్దశేష వాహనం నిర్వహిస్తారు. జూలై 1వ తేదీ ఉదయం 11 గంటలకు స్నపన తిరుమంజనం , సాయంత్రం ఊంజల్ సేవ, రాత్రి 7 గంటలకు హనుమంత వాహనం ఉంటాయి. జూలై 2వ తేదీ ఉదయం స్నపన తిరుమంజనం, ఊంజల్ సేవ చేపడతారు. రాత్రి 7 గంటలకు స్వామి వారి గరుడ వాహన సేవ నిర్వహిస్తారు. చివరిరోజు జూలై 3వ తేదీ ఉదయం పార్వేట ఉత్సవం నిర్వహిస్తారు. వైభవోత్సవాల సందర్భంగా ఆర్జిత సేవలు రద్దు చేస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ పెరిగింది. క్యూకాంప్లెక్స్‌లో 24 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 79,466 మంది స్వామి వారిని దర్శించుకున్నారు. 29,227 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.05 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన వారికి సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 18 గంటలు పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన వారికి 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉండగా సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలైన్లోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. ముందుగా వెళ్లిన వారిని క్యూలో అనుమతించబోమని స్పష్టం చేసింది.

కార్పొరేషన్ నిధులతో 'స్మార్ట్ సిటీ'



అధికారుల సమావేశంలో కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్: తిరుపతి స్మార్ట్ సిటీ పనులకు కార్పొరేషన్ నిధులు వినియోగించుకోవాలని స్మార్ట్ సిటీ చైర్మన్, కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ స్మార్ట్ సిటీ కింద పురోగతిలోని 14 పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. ప్రాజెక్టు, ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్, సోలార్ ప్రాజెక్టు సత్వరం అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. సమావేశంలో స్మార్ట్ సిటీ సీఈఓ, తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ మౌర్య, ఎస్పీ హర్షవర్ధన్ రాజు, ఇంజినీర్ ఇన్ చీఫ్ ప్రభాకర్ రావు, ఇండిపెండెంట్ డైరెక్టర్స్ డాక్టర్ రామచంద్రారెడ్డి, డాక్టర్ రమ పాల్గొన్నారు.

పెండింగ్ అర్జీలపై సమీక్ష

కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌పై కలెక్టర్ వెంకటేశ్వర్ సమీక్షించారు. పెండిగ్ అర్జీల పరిష్కారానికి అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని ఆదేశించారు. ఎప్పటి పనులను అప్పుడే పూర్తి చేయాలని సూచించారు. గురువారం సాయంత్రం మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మండల, డివిజన్, జిల్లాస్థాయిలో ర్యాలీలు నిర్వహించాలని కోరారు. విద్యార్థులు, ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని కోరారు. ఈ మేరకు ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. సమావేశంలో డీఆర్‌ఓ నరసింహులు పాల్గొన్నారు.



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.1,00,170
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.9,067
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.1,08,400
రిటైల్ వెండి గ్రాము	రూ.111.40

క్లుప్తంగా

నవోదయ ఫలితాల్లో 'విశ్వం' ప్రతిభ


నవోదయకు ఎంపికైన విద్యార్థిని

తిరుపతి ఎడ్యుకేషన్ : జవహర్ నవోదయ విద్యాలయాల్లో 9వ తరగతిలో ప్రవేశాలకు ప్రకటించిన రెండో విడత ఫలితాల్లో తిరుపతిలోని విశ్వం విద్యార్థులు ప్రతిభ చాటారు. బి.సాత్విక, ఎస్.ఝాన్సీరెడ్డి అర్హత సాధించినట్లు విద్యాసంస్థ అధినేత ఎన్.విశ్వనాథరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ 6, 9వ తరగతుల్లో ప్రవేశాలకు మొత్తం 57మంది విద్యార్థులు అర్హత సాధించినట్లు వెల్లడించారు. అనంతరం ప్రతిభ చాటిన విద్యార్థులను అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్‌రెడ్డి, కరస్పాండెంట్ ఎన్.తులసీ విశ్వనాథ్ అభినందించారు. 2026 నవోదయ ప్రవేశ పరీక్ష దరఖాస్తులకు 86888 88802, 93999 76999నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

పకడ్బందీగా 'టీబీ ముక్త్ భారత్'


అడిషినల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ శైలజ

తిరుపతి తుడా: జిల్లాలో టీబీ ముక్త్ భారత్ అభియాన్‌ను పకడ్బందీగా అమలు చేయనున్నట్లు అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ శైలజ తెలిపారు. అన్నమయ్య జిల్లా నుంచి తిరుపతి అడిషనల్ డీఎంహెచ్‌ఓగా ఆమె బదిలపై వచ్చారు. బుధవారం ఈ మేరకు బాధ్యతలు చేపట్టారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో టీబీ, లెప్రసీ, ఎయిడ్స్ నివారణకు కృషి చేస్తానని చెప్పారు. అన్ని ఇండికేటర్లలో నిర్దేశించిన లక్ష్యాలను అందరి సహకారంతో 100 శాతం సాధించడానికి ప్రయత్నిస్తానని తెలిపారు. టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో క్షయ బాధితులను వేగంగా గుర్తించడం, మరణాలను తగ్గించడం వంటి అంశాలే అజెండాగా పనిచేయనున్నట్లు వివరించారు. ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించి పొగ,మద్యం తాగేవారు, టీబీ నుంచి ఉపశమనం పొందిన వారు, హెచ్‌ఐవీ పాజిటివ్, బీఎంఐ 18 కంటే తక్కువ ఉన్న వారు, గర్భిణులు, షుగర్ వ్యాధిగ్రస్తులను గుర్తిస్తారని వెల్లడించారు. ఇందులో పాజిటివ్ వచ్చిన వారికి ఆరు నెలల చికిత్స ఉచితంగా అందిస్తామన్నారు. ఆ సమయంలో పౌష్టికాహారం తీసుకోవడంకోసం రోగి ఖాతాలో రూ.1000లు జమ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో క్షయ నివారణ ఉద్యోగులు లోకేష్, మురళి,మొహిద్దీన్, దేవరాజులు, సుకన్య , సౌజన్య , మహేశ్వ పాల్గొన్నారు.


పల్లంపేటలో రాస్తారోకో

బడి కోసం.. ఆగని పోరాటం

అర్థ పర్థం లేని నిర్ణయాలతో విద్యావ్యవస్థను ప్రభుత్వం విధ్వంసం చేస్తోంది. పాఠశాలల విలీనం పేరుతో గ్రామీణ విద్యార్థులను ఇబ్బందిపెడుతోంది. స్వగ్రామంలో చదువుకునే వెసులుబాటును దూరం చేస్తోంది. సర్కారు వైఖరిపై పల్లెవాసులు మండిపడుతున్నారు. అనాలోచిత విధానాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని ఎక్కడి బడులను అక్కడే కొనసాగించాలని కోరుతున్నారు. లేకుంటే పోరాటం తీవ్రతరం చేస్తామని హెచ్చరిస్తున్నారు. సానుకూలంగా స్పందించే వరు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేస్తున్నారు. అందులో భాగంగా బుధవారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో విద్యార్థులతో కలిసి తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు.

- పాఠశాలల విలీనంపై వెల్లువెత్తిన నిరసన
- ప్రభుత్వ వైఖరిపై గ్రామీణుల ఆగ్రహం
- పిల్లలను చదువుకు దూరం చేయవద్దని ఆందోళన

ఏర్పేడు : పాఠశాలల విలీన ప్రక్రియకు నిరసనగా ఏర్పేడు మండలం ఎండీ పుత్తూరు, పల్లంపేటలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు బుధవారం ఆందోళన చేపట్టారు. ఎండీ పుత్తూరు సర్పంచ్ కందాటి మోహనప్రియ ఆధ్వర్యంలో తల్లిదండ్రులు తమ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను పక్క ఊరి బడిలో విలీనం చేయడంపై ధర్నాకు దిగారు. కార్యక్రమంలో విద్యాకమిటీ చైర్మన్ జలజ, చంద్రశేఖర్ రెడ్డి, మోహనరామి రెడ్డి, గోవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు. అలాగే పల్లంపేట బడిలో 60మంది పిల్లలు చదువుతుంటే పల్లం గ్రామంలోని పాఠశాలలో విలీనం చేయడం దారుణమని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి వందవాసి నాగరాజు ఆవేదన వ్యక్తం చేశారు. పల్లం పాఠశాల వద్ద హైవేపై రాస్తారోకో చేపట్టారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రంగయ్య, సెల్వరాజ్, రాంబాబు, వెంకటేశ్వరరావు, వెంకటాద్రి పాల్గొన్నారు.

కేవీబీపురం : మండలంలోని బంగారమ్మకండ్రిగ, గురుకులకండ్రి బడులకు గ్రామస్తులు తాళాలు వేశారు. పది రోజులుగా విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఉపాధ్యాయులు బడికి వచ్చి బయటే కూర్చుని వెళ్లిపోతున్నారు. విలీన ప్రక్రియను ఆపే వరకు బడికి తాళం తీసే ప్రసక్తే లేదని గ్రామస్తులు స్పష్టం చేశారు.

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని ఆలత్తూరు పార్లపల్లెలోని ప్రాథమిక పాఠశాలను రద్దు చేయడంపై బుధవారం విద్యార్థుల తల్లిదండ్రులు బీఎన్ కండ్రిగ ఎంఈఓ కార్యాలయం ముట్టడించారు. వారు మాట్లాడుతూ తమ గ్రామంలోని బడిని, పీవీ కండ్రిగలోని పాఠశాలలో విలీనం చేశారని తెలిపారు. 2 కిలోమీటర్ల దూరంలో ఉన్న పీవీకండ్రిగ పాఠశాలకు చెరువు గట్టు, కలుజు, పంట కాలువ, శ్మశానం దాటుకుని వెళ్లాల్సి ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలను రద్దుకు వ్యతిరేకంగా ఎస్ఎంసీ తీర్మానం చేసినప్పటికీ పట్టించుకోకపోవడం దారుణమని మండిపడ్డారు. జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించి పాఠశాల రద్దును నిలిపివేయాలని, లేకుంటే ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు. దీనిపై ఎంఈఓ రవీంద్రనాథ్ మాట్లాడుతూ ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని వెల్లడించారు.


ఎండీ పుత్తూరులో తల్లిదండ్రుల నిరసన


కేవీబీపురం : బడి బయటే కూర్చున్న ఉపాధ్యాయుడు



బీఎన్ కండ్రిగ ఎంఈఓ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న తల్లిదండ్రులు

ఆత్మహత్యాయత్నంపై విచారణ

బుచ్చినాయుడుకండ్రిగ : తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఓ మహిళ ఆత్మహత్యకు యత్నించడంపై సూళ్లూరుపేట ఆర్‌డీఓ కిరణ్మయి బుధవారం విచారణ చేపట్టారు. కొత్త పాళెంలో తనకు వారసత్వంగా వచ్చిన భూములను ఏపీపీఐబీసీ సేకరించిందని, అయితే నష్ట పరిహారం అందించలేదని చిటికెల సరస్వతి అనే మహిళ ఒంటిపై పెట్రోల్ పోసుకుని సోమవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. దీనిపై కలెక్టర్ ఆదేశాల మేరకు బాధిత మహిళను తహసీల్దార్ శ్రీదేవితో కలసి ఆర్‌డీఓ విచారించారు. ఆమె మాట్లాడుతూ భూమికి సంబంధించిన రికార్డులను పూర్తి స్థాయిలో పరిశీలించి, క్షేత్ర స్థాయిలో సర్వే చేసి న్యాయం చేస్తామన్నారు. ఆత్మాహత్యా యత్నం నేరమని, మరోసారి ఇలాంటి చర్యలకు పాల్పడవద్దని బాధిత మహిళకు సూచించారు.

చెరువులో పడి యువకుడి మృతి


మునిరత్నం మృతదేహం

రేణిగుంట : నీటి కోళ్లు పట్టుకునేందుకు యత్నించిన ఓ యువకుడు బుధవారం చెరువులో మునిగి మృత్యువాత పడ్డాడు. వివరాలు.. కోట మండలానికి చెందిన మునిరత్నం (22) బుధవారం రేణిగుంట మండలం మర్రిగుంట చెరువులో నీటి కోళ్లు పట్టేందుకు దిగాడు. ప్రమాదవశాత్తు మునిగిపోయాడు. గాజులమండ్యం పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికి తీశారు. పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సుధాకర్ తెలిపారు.

పాలిటెక్నిక్ విద్యలో మార్పులకు శ్రీకారం

- రాష్ట్ర సాంకేతిక విద్య డైరెక్టర్ గణేష్‌కుమార్



ప్రాంతీయ వర్క్‌షాపులో మాట్లాడుతున్న సాంకేతిక విద్య ఆర్‌జేడీ నిర్మల్‌కుమార్

తిరుపతి ఎడ్యుకేషన్ : ప్రస్తుత పారిశ్రామిక రంగానికి అనుగుణంగా విద్యార్థుల్లో నైపుణ్యం పెంపొందించేందుకు పాలిటెక్నిక్ డిప్లొమో కోర్సుల్లో మార్పులకు శ్రీకారం చుట్టనున్నట్లు రాష్ట్ర సాంకేతిక విద్య డైరెక్టర్ జి.గణేష్‌కుమార్ వెల్లడించారు. పాలిటెక్నిక్ డిప్లొమో కరికులంపై బుధవారం తిరుపతిలోని ఓ హోటల్‌లోరాష్ట్ర సాంకేతిక విద్య, శిక్షణా బోర్డు (ఎస్‌బీటీఈటీ) ప్రాంతీయ వర్క్‌షాపు నిర్వహించింది. ముఖ్య అతిథిగా గణేష్ కుమార్ ఆన్‌లైన్‌లో హాజరై మాట్లాడారు. డిప్లొమో కోర్సుల విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉందని, వివిధ ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో వీరిని చేరికకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. అయితే పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా కరికులంలో మార్పులు అవసరమని గుర్తించామని, వర్క్‌షాపులో పలువురు పారిశ్రామికవేత్తలు, యూనివర్సిటీ ప్రొఫెసర్లు, పాలిటెక్నిక్ ప్రిన్సిపాళ్లు, టీచర్లతో చర్చించి కరికులం మార్పులకు శ్రీకారం చుడుతున్నట్లు చెప్పారు. సాంకేతిక విద్య ఆర్జేడి ఎ.నిర్మల్‌కుమార్ ప్రియ మాట్లాడుతూ, మారుతున్న సాంకేతికతకు కాలానుగుణంగా నైపుణ్యాల పెంపు, అలాగే ఆన్‌లైన్ మూల్యాంకనాన్ని ప్రవేశ పెట్టాల్సిన ఆవశ్యకతను వివరించారు. అనంతరం పలు అంశాలపై చర్చించి అభిప్రాయాలు సేకరించారు. కార్యక్రమంలో సాంకేతిక విద్య కార్యదర్శి జీవి.రామచంద్ర, సంయుక్త కార్యదర్శి జీవి.సత్యనారాయణమూర్తి, ట్రెనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ ఎంపీ.రామకృష్ణ, నాస్కామ్ ప్రతినిధి డాక్టర్ చింతల సంధ్య తదితరులు పాల్గొన్నారు.

నిరంకుశ పాలనపై నిరసన

- చెవిరెడ్డి అరెస్ట్ అన్యాయం
- రెడ్‌బుక్ రాజ్యాంగానికి త్వరలోనే కాలం చెల్లుతుంది
- ప్రభుత్వ దారుణాలకు ప్రజలే బుద్ధి చెబుతారు
- వైఎస్సార్‌సీపీ పాకాల నేతలు


నల్ల బ్యాడ్జీలతో నిరస తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు

పాకాల : చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని అరెస్ట్ చేయడం అన్యాయమని వైఎస్సార్‌సీపీ పాకాల నేతలు మండిపడ్డారు. కూటమి ప్రభుత్వ నిరంకుశ పాలనపై స్థానిక ఆర్‌టీసీ బస్టాండ్ వద్ద అంబేడ్కర్ విగ్రహం ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. నేతలు మాట్లాడుతూ రాష్ట్రంలో అమలు చేస్తున్న రెడ్‌బుక్ రాజ్యాంగానికి త్వరలోనే కాలం చెల్లుతుందన్నారు. ప్రభుత్వం కుట్రపూరితంగా చేస్తున్న దారుణాలకు ప్రజలే బుద్ధి చెబుతారని స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చెవిరెడ్డి ఎవరిపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడలేదని, సాధ్యమైనంత వరకు అందరికీ మంచే చేశారని వెల్లడించారు. చంద్రగిరి నియోజకవర్గంలో చెవిరెడ్డి ద్వారా లబ్ధిపొందని కుటుంబమే లేదని స్పష్టం చేశారు. అనంతరం వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నంగా నరేష్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి, కపిలేశ్వర్‌రెడ్డి, రైతు సంఘం నేత భాస్కర్‌నాయుడు, ఎంపీపీ లోకనాథం, మునీర్, రహీమ్, గుండ్లూరి సురేష్, వినాయక, రమేష్, చంటి, లోకనాథరెడ్డి, బాను, ఇమ్రాన్, గోపి, సద్దాం పాల్గొన్నారు.

ఎప్పటికీ చెవిరెడ్డి వెంటే..



"కూటమి ప్రభుత్వం అభివృద్ధిని గాలికి వదిలేసి రెడ్‌బుక్ పేరుతో కక్షసాధింపులకు పాల్పడుతోంది. ఎన్ని కేసులు పెట్టినా చెవిరెడ్డి ఎవరూ ఏం చేయలేరు. నిత్యం దైవ చింతనలో ఉండే చెవిరెడ్డి తిరుమల శ్రీవారి ఆశీస్సులు మెండుగా ఉంటాయి.

– ఎస్.మునీర్, ఏఎంసీ మాజీ చైర్మన్, పాకాల

ఎదుర్కోలేకే..



చెవిరెడ్డి చేసిన సేవలు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయి. ఆయనను నేరుగా ఎదుర్కొనే దమ్ములేకనే అధికారం అడ్డుపెట్టుకుని అక్రమంగా అరెస్టు చేయించారు. కూటమి నేతలకు చిత్తశుద్ధి ఉంటే అభివృద్ధిపై దృష్టి పెట్టాలి.

– గుంగ్లూరి సురేష్, మండల యువజన విభాగం అధ్యక్షుడు, పాకాల

దేవుడు చూస్తున్నాడు



కూటమి నేతల దాడులు, దౌర్జన్యాలను దేవుడు చూస్తున్నాడు. అన్యాయంగా చెవిరెడ్డిని అరెస్ట్ చేసిన పాపం ఊరికే పోదు. ప్రజా కంటకులను త్వరలోనే తరిమికొట్టే రోజులు వస్తాయి. కర్మ ఫలితం అనుభవించేందుకు కూటమి నేతలు సిద్ధంగా ఉండాలి.

– పి.హసీనా, ఎంపీటీసీ మాజీ సభ్యులు, పాకాల

ఎంబీయూలో ముగిసిన ఎన్‌సీసీ శిక్షణ


ముగింపు కార్యక్రమంలో విద్యార్థుల ప్రదర్శన

చంద్రగిరి : మోహన్‌బాబు యూనివర్సిటీ (ఎంబీయూ)లో నిర్వహిస్తున్న ఎన్‌సీసీ శిక్షణ శిబిరం బుధవారంతో ముగిసింది. ఈ నెల 16 నుంచి జిల్లా వ్యాప్తంగా వివిధ పాఠశాలలకు చెందిన సుమారు 550 మంది విద్యార్థులు శిక్షణ శిబిరంలో పాల్గొన్నారు. బుధవారం దాసరి ఆడిటోరియంలో చేపట్టిన ముగింపు కార్యక్రమంలో గ్రూప్ కమాండర్ అంజు దమియా, కల్నల్ సంజయ్ సింగ్, ట్రెనింగ్ అధికారి కల్నల్ సందీప్ మాట్లాడుతూ క్రమశిక్షణ, ఐక్యత, ఏకాగ్రతపై విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించినట్లు తెలిపారు. అలాగే ఫైరింగ్, డ్రిల్ నైపుణ్యాలతోపాటు సాంస్కృతిక, క్రీడా పోటీలను చేపట్టినట్లు వివరించారు. విద్యార్థి దశ నుంచి దేశభక్తిని పెంపొందించడమే లక్ష్యంగా శిక్షణ శిబిరం నిర్వహించినట్లు వెల్లడించారు. ఎంబీయూ అందించిన సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆపదలో ఉన్నవారి రక్షణకు చేపటాల్సిన చర్యలపై విద్యార్థుల ప్రదర్శన ఆకట్టుకుంది.

కామాంధుడికి దేహశుద్ధి

సత్యవేడు: మండలంలోని చెన్నేరి గ్రామంలో ఓ బాలిక (11)పై అదే గ్రామానికి చెందిన ఆర్.నాగరాజు(38) బుధవారం సాయంత్రం లైంగిక దాడికి యత్నించాడు. బాలిక కేకలు వేడయడంతో స్థానికులు గుర్తించి కామాంధుడికి దేహశుద్ధి చేశారు. తల్లిదండ్రులు ఊత్తుకోటకు వెళ్లడంతో సమయం చూసి నిందితుడు ఇంట్లోకి చొరబడ్డాడు. బాలిక తల్లిదండ్రులు సత్యవేడు పోలీసులను ఆశ్రయించగా డీఎస్పీ రవికుమార్ సూచనల మేరకు సీఐ మురళీ నాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ రామస్వామి కేసు నమోదు చేశారు. అయితే నిందితుడికి మతిస్థిమితం లేదని, ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్


నిందితుడి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

చిల్లకూరు : స్థానిక మేదర కాలనీలో మంగళవారం జరిగిన హత్య కేసులో నిందితుడిని పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. సీఐ కిషోర్‌బాబు మాట్లాడుతూ చిల్లకూరు వడ్డిపాళానికి చెందిన అచ్చి ప్రవీణ్‌కుమార్‌ను, అదే ప్రాంతానికి చెందిన బండి సుబ్రమణ్యం పాత కక్షల నేపథ్యంలో కత్తితో గొంతు కోసి చంపేశాడన్నారు. ఈ మేరకు మృతుడి కుటుంబ సభ్యుల నుంచి ఫిర్యాదు అందుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. ఎస్ఐ సురేష్‌బాబు పాల్గొన్నారు.

సర్పంచ్ సుభాషిణికి కన్నీటి వీడ్కోలు


సుభాషిణి భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న వైఎస్సా ర్‌సీపీ నేతలు(ఇన్‌సెట్) సుభాషిణి (ఫైల్)

తిరుపతి రూరల్ : మండలంలోని చెర్లోపల్లె పంచాయతీని అద్భుతంగా తీర్చిదిద్ది ఉత్తమ సర్పంచ్‌గా కేంద్ర ప్రభుత్వం నుంచి శక్తి పంచాయత్ నేత్రి అభియాన్ పురస్కారం పొందిన బొల్లినేని సుభాషిణికి బుధవారం పలు పార్టీల నేతలు, గ్రామస్తులు కన్నీటి వీడ్కోలు పలికారు. వివరాలు.. తిరుపతి రూరల్ ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన మహిళా సర్పంచ్‌ల శిక్షణలో చురుగ్గా పాల్గొన్న సుభాషిని మంగళవారం సాయంత్రం ఇంటికి చేరుకున్న కొద్దిసేపటికే స్పృహ తప్పి కిందపడిపోయారు. కుటుంబీకులు వెంటనే తిరుపతిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్సకు ఆమె సహకరించకపోవడంతో రాత్రి 10.30 గంటలకు సర్పంచ్ సుభాషిణి కన్నుమూసినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో ఆమె భర్త బొల్లినేని శుభగిరి నాయుడు కన్నీటి పర్యంతమై కుప్పకూలిపోయారు. దీంతో ఆయనకు రాత్రంతా అక్కడే చికిత్స చేశారు. అనంతరం ఇంటికి చేరుకున్న శుభగిరికి కుటుంబీకులు ధైర్యం చెప్పారు. సుభాషిణి మృతదేహానికి ఎమ్మెల్యే పులివర్తి నాని, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మి, వైస్ ఎంపీపీలు యశోద, మాధవరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మునీశ్వరరెడ్డి నివాళులర్పించారు. బుధవారం సాయంత్రం 3 గంటలకు చెర్లోపల్లె శ్మశాన వాటికలో సుభాషిణి భౌతికకాయానికి అంత్యక్రియలు నిర్వహించారు.

విస్తృత స్థాయి సమావేశంలో జిల్లా నేతలు


తాడేపల్లిలోని కేంద్ర కార్యాలయంలో బుధవారం నిర్వహించిన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొన్న జిల్లా నేతలు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, భూమన కరుణాకర రెడ్డి, ఆర్‌కే రోజా. – తాడేపల్లి

'కెనాల్' కట్టలపై చెట్ల నరికివేత


కర కట్టపై వేసిన రహదారి


లారీలో తరలిపోతున్న వృక్ష సంపద

వాకాడు : మండలంలోని పంబలి లాకుల వద్ద బకింగ్‌హామ్ కెనాల్ కరకట్టలపై చెట్లను కొందరు అక్రమార్కులు యథేచ్ఛగా నరికేస్తున్నారు. కట్టెలను లారీల్లో ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. కెనాల్ వద్ద విధులు నిర్వర్తించే లస్కర్ సైతం అక్రమార్కులతో కుమ్మక్కై, విలువైన వృక్ష సంపదను కొల్లగొడుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కట్టెల తరలింపునకు అనువుగా వాహనాలు రాకపోకలు సాగించేందుకు కెనాల్ కరకట్టలను ధ్వంసం చేసి రహదారిని సైతం నిర్మించడం గమనార్హం. బకింగ్‌హామ్ కెనాల్ ఉనికినే ప్రశ్నార్థకంగా మార్చేందుకు యత్నిస్తున్న అక్రమార్కులపై కొందరు స్థానికులు మండిపడుతున్నారు. వారికి సహకరిస్తున్న లస్కర్‌పై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలో అక్రమ రవాణాకు పంబలి వాసులు అడ్డు పడకుండా లస్కర్ మధ్యవర్తిత్వం నడిపి గ్రామానికి కొంత నగదు సైతం ఇప్పించినట్లు ఆరోపిస్తున్నారు. కరకట్టలపై చెట్లను ఆధునిక యంత్రాల సాయంతో నరికి లారీల ద్వారా చెన్నై, గుమ్మిడిపూండి తదితర ప్రాంతాలకు తరలించి విక్రయిస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బకింగ్‌హామ్ కెనాల్‌ను పరిరక్షించాల్సిన అవసరముంది.